04 SEP 2020 ANDHRA JYOTHI

04 SEP 2020



## ఫెర్రీ రోడ్డుపైకి వరదనీరు

యానాం, సెప్టెంబర్ 3: యానాన్ని మళ్లీ వరద తాకింది. ఎగువ నుంచి ధవళేశ్వరం బ్యారేజీకి భారీగా వచ్చి చేరుతున్న వరదనీటిని సముద్రంలోకి వదులుతున్నారు. దీంతో యానాం-ఎదుర్లంక వారధి ప్రాంతంలో గౌతమిగోదావరికి వరద ఉధృతంగా ప్రవాహిస్తోంది. దీంతో మత్స్యకారుల నావలు, పర్యాటక బోట్లు ఒడ్డుకు చేరాయి. పలు పల్లపుప్రాంతాలు నీట మునిగాయి. పరిపాలనాధికారి కార్యాలయం నుంచి రాజీవ్ బీచ్‌కు వెళ్లె ఫెర్రీ రోడ్డు మధ్యకు వరదనీరు చేరుకుంది. ఆ ప్రాంతంలో స్లూయిజ్ ఉండడం వల్ల పాటుపోటులకు వరదనీరు రోడ్డుపైకి చేరుతోంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

← ఫెర్రీ రోడ్డుపైకి చేరిన వరదనీరు

# హోం ఐసోలేషన్ రద్దు

నిబంధనలు పాటించకుంటే

### పుదుచ్చేరి సమీక్షాసమావేశంలో మంత్రి మల్లాడి

యానాం, సెప్టెంబరు 3: నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తే హోం ఐసోలేషన్ రద్దు చేస్తామని పుదుచ్చేరి ఆరోగ్యశాఖమంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఈ మేరకు పుదుచ్చేరిలో ముఖ్యమంత్రి వి.నారాయణసామి నేతృత్వంలో జరిగిన ఉన్నాతాధికారుల సమీక్షా సమావేశంలో మల్లాడి కృష్ణారావు మాట్లాడారు. పుదుచ్చేరిలో అత్యధికంగా కరోనా కేసులు పెరుగుతున్నాయని నాలుగు రీజియన్లలో



అధికారులతో సమీక్షిస్తున్న సీఎం నారాయణసామి, మంత్రి మల్లాడి

కేసులు పెరుగుదలలో పుదుచ్చేరి తొలిస్థానంలోను, యానాం రెండో స్థానంలో ఉన్నాయన్నారు. హోం ఐసోలేషన్‌లో బాధితులు నిబంధనలు పాటించపోవడం వల్లే పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయనే విషయం తమ పరిశీలనలో తేలిందన్నారు. పుదుచ్చేరితోపాటు యానాం నియోజకవర్గంలోని పరిసితులను సమావేశంలో చర్చించారు.

**పరిపాలనాధికారి సమీక్ష..**

హోంఐసోలేషన్‌కు సంబంధించిన అంశాలపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో పరిపాలనాధికారి(ఆర్ఎ) శివరాజ్‌మీనా గురువారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. హోంఐసోలేషన్ బాధితుల ఇల్లు నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే అనుమతివ్వాలని, తరుచూ జోన్ అధికారుల పర్యవేక్షణ చేయాలన్నారు.

### వెయ్యి దాటిన కరోనా కేసులు

యానాం, సెప్టెంబరు 3: యానాం నియోజకవర్గంలో గురువారం 44 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో కొవిడ్ కేసుల సంఖ్య 1022కి చెరింది. పాజిటివ్ వచ్చిన వ్యక్తి హోమ్ఐసోలేషన్‌లో ఉంటునప్పటికీ వారు కుటుంబసభ్యులతో కలిసి ఉండడంతో కేసుల సంఖ్య మరింత పెరుగుతున్నట్టు తెలుస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజల సహకారంతోనే కరోనా నియంత్రణం సాధ్యం అని మంత్రులు, అధికారులు ఎంతచెప్పినా ఫలితం శూన్యం. కరోనాతో ఇప్పటివరకు 28 మంది మృతిచెందారు. 704మంది డిశ్చార్జ్ కాగా తాజా కేసులతో కలిపి ప్రస్తుతం 290 యాక్టివ్ కేసులు ఉన్నాయి.

### 'తక్షణమే కొవిడ్ సదుపాయాలు కల్పించాలి'

యానాం, సెప్టెంబరు 3: యానాం నియోజకవర్గంలో కరోనా నియంత్రణకు సంబంధించిన సదుపాయాలు తక్షణమే కల్పించాలని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీని యానాం పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్, హ్యూమన్ సర్వీస్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు యానాం పరిపాలనాధికారి కార్యాలయం ఎదురుగా ప్లకార్డులతో నిరసన తెలిపారు. ప్రస్తుతం ఉన్న మూడు వెంటిలేటర్లలో రెండు మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. ఇప్పటికే తెచ్చిన 11 వెంటిలేటర్లను ఏర్పాటు చేయడంలేదని ఆరోపించారు. కరోనాకు సంబంధించి అన్ని సదుపాయాలను ఏర్పాటుచేయాలని కోరారు. కొవిడ్ విధులు నిర్వహిస్తూ మృతిచెందిన ఉద్యోగులకు రూ.50 లక్షల నుంచి రూ. కోటి వరకు పరిహారం ఇవ్వాలని, కరోనాతో మృతిచెందిన ప్రజలకు రూ.25 లక్షలు పరిహారం ఇవ్వా లని డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని యానాం పరిపాలనాధికారికి అందజేశారు. కార్యక్రమంలో వెలగా రాజేశ్వరరావు, గుత్తుల రామరావు, దూళిపూడి మదవ వెంకన్న, నిమ్మకాయల శ్రీనివాస్ పాల్గొన్నారు.

PRAJA SAKTHI

04 SEP 2020

## రూ.5.22 లక్షలకు లడ్డూ వేలం

**యానాం** : యానాం కనకాలపేట రామాలయం సెంటర్‌లోని నెలకొల్పిన వీనాయక లడ్డూను 5.22 లక్షలకు ప్రముఖ వ్యాపారవేత్త కె.రామ్మూర్తి కైవశం చేసుకున్నారు. చవితి ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని గురువారం నిమజ్జనం చేశారు. అనంతరం లడ్డూకు వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మూర్తిని ఆలయా కమిటీ సభ్యులు సత్కరించారు..

04 SEP 2020

ENADU

## ఆసుపత్రిలో ప్రత్యేక వైద్యులను నియమించాలి

యానాం, న్యూస్‌టుడే: కరోనా విస్తరిస్తున్నా తగు జాగ్రత్తచర్యలు తీసుకోకుండా ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందంటూ యానాం పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్, యానాం హ్యూమన్ పర్ సర్వీసెస్ నేతలు ప్లకార్డులు చేపట్టి పరిపాలనాధికారి కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. పాత వెంటిలేటర్లు రెండు మాత్రమే పని చేస్తున్నాయని, కొత్తగా తెచ్చిన 11 వెంటిలేటర్ల కవర్లు కూడా తీయకుండా పక్కనపెట్టారని ఎల్‌జీ కిరణ్ బేడీకి మాజీ ఎమ్మెల్యే వెలగా రాజేశ్వరరావు, గుత్తుల రామారావు ఫిర్యాదు చేశారు. రెమిడిసీవర్ వంటి అత్యవసర మందులను తక్షణమే ఆసుపత్రికి పంపాలని, ఇద్దరు సీనియర్ డాక్టర్లను నాలుగు నెలలపాటు డిప్యూటేషన్‌పై పంపాలని, లోపాలు సరిదిద్దాలని కోరారు. ఆందోళనలో ధూళిపూడి మాధవవెంకన్న, చెక్కల అరుణ్‌కుమార్, నిమ్మకాయల శ్రీనివాసరావు, పెసల వీరవెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**యానాం:** యానాం ప్రాంతంలో కరోనా కేసులు పెరుగుతున్నందున ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకు దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేయనున్నట్లు కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ తెలిపారు.

**యానాం:** కరోనా వైరస్ సోకిన రోగులు మానసిక భయాందోళనకు గురికాకుండా ఉంటే ఆక్సిజన్ సిలిండర్ల అవసరం ఉండదని, వత్తిడిని భయాన్ని జయిస్తే రోగం నుంచి సురక్షితంగా కోలుకోవచ్చని పరిపాలనాధికారి శివరాజ్‌మీనా స్పష్టం చేశారు. శుక్రవారం సెంట్రల్ ఆక్సిజన్ ప్లాంట్ ప్రభుత్వాసుపత్రిలో ప్రారంభమవుతుందన్నారు.

### యానాంలో బెడద..

**యానాం:** గోదావరిలో మళ్లీ వరదనీటి ప్రవాహం పెరగడంతో యానాంలోని నదీపరీవాహక ప్రాంతం ఫ్రాన్సుతిప్పపై గురువారం ప్రభావం చూపింది. గురుకృష్ణాపురం వెలుపల ఉన్న కల్వర్టును మూసేయకపోవడంతో వరదనీరు స్లూయిజ్ గుండా లోనికి ప్రవేశించి ఫెర్రీరోడ్డు, పక్కనే ఉన్న గురుకృష్ణాపురం, ఫ్రాన్సుతిప్పలోని పల్లపుప్రాంతాలు, జీఎంసీ బాలయోగినగర్ కాలనీల్లో రహదారులను ముంచెత్తింది. దీనితో ప్రజల ఫిర్యాదుల మేరకు ప్రజాపనులశాఖాధికారులు పరిశీలించి బాలయోగినగర్ కాలనీలోకి ప్రవేశించిన నీటిని జేఈ యాళ్ల వీరాస్వామి ఇంజిన్లతో దగ్గరుండి తోడించారు.

**యానాం:** డిగ్రీ, ఇంజినీరింగ్ తుది సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 14 నుంచి 29 వరకు నిర్వహించేందుకు కళాశాలలు ఏర్పాట్లు చేసుకోవాలని పాండిచ్చేరి యూనివర్శిటీ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ఆదేశాలు జారీ చేయడంతో యానాం విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. పుదుచ్చేరిలో కరోనా వైరస్ విపరీతంగా వ్యాప్తిచెందుతున్న పరిస్థితిలో 850 కి.మీల దూరం ప్రయాణించి ఎలా పరీక్షలు రాస్తారని, ఎక్కడ బస చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు.

## ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

**యానాం:** యానాంలోని నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐతోపాటు పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ఒక ఏడాది, రెండేళ్ల క్రాఫ్ట్స్‌మెన్ ట్రైనింగ్ పథకం కోర్సులలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు కార్మికశాఖ కార్యదర్శి వల్లవన్ తెలిపారు. దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ఈ నెల 11 వరకు కొనసాగుతుందని, ఎనిమిదో తరగతి చదివి, 14 ఏళ్లు దాటిన వారు కోర్సులలో చేరేందుకు అర్హులని, మెకానిక్ ట్రేడులో చేరాలంటే 17 ఏళ్లు ఉండాలన్నారు. అన్ని వివరాలు లేబర్.పీవై.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చన్నారు.